www.aksharadarbar.com
గురువారం 28, మార్చి 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :51 | సంపుటి :02 | పేజీలు : 06 | వెల : 05

మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో

# 99.86 శాతం పోలింగ్

ఓటు హక్కును వినియోగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

04

# ప్రచారానికి కాంగ్రెస్ సన్నద్ధం

- 6న తుక్కుగూడలో బహిరంగ సభకు ముహూర్తం ఫిక్స్
- సభకు హాజరుకానున్న అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ
- జాతీయ స్థాయి మానిఫెస్టోను ప్రకటించేందుకు నిర్ణయం
- సభ నిర్వహణకు తుక్కుగూడ వద్ద ఏర్పాట్లకు శ్రీకారం
- సెంటిమెంట్ ను కొనసాగిస్తున్న హస్తం పార్టీ
- పెండింగ్ స్థానాల్లో గెలుపు గుర్రాల కోసం సర్వే

02

లోక్ సభ ఎన్నికల్లో విజయం కోసం కాంగ్రెస్ ప్రచారానికి సిద్ధమైంది. జాతీయ మ్యానిఫెస్టోను 6న ప్రకటించనున్నారు. తుక్కుగూడలో జరిగే బహిరంగ సభతో ప్రచారానికి శంఖారావం పూరించనున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసిన పార్టీ అదిష్టానం ప్రచారంలో దూసుకుపోవడానికి ప్రణాళిక రూపొందించారు. కాంగ్రెస్ ఇచ్చే 5 హామీలను విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. తుక్కుగూడలో 6న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ తాజాగా ప్రకటించింది. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఇచ్చే 5 హామీలను ఆ బహిరంగ సభలో వెల్లడించనున్నారు. శాసన సభ ఎన్నికల సమయంలో తుక్కుగూడ నుంచే ప్రచారం ప్రారంభించి విజయం సాధించిన కాంగ్రెస్ అదే సెంటిమెంట్ ను లోక్ సభ ఎన్నికల్లో కొనసాగిస్తున్నది. సభ నిర్వహణకు పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యారు.

–అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

## తుక్కుగూడ సభ ద్వారా ఐదు గ్యారెంటీలు

- ప్రకటించనున్న రాహుల్ గాంధీ
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- కొడంగల్ నేతలతో సమావేశమైన సీఎం

02

## ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

మరో 4 రోజులు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు

04

## కేసీఆర్ ను కలిసిన కేకే

- పార్టీ మారుతానని స్పష్టం
- మీకేం తక్కువ చేశామన్న కేసీఆర్

04

## ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

- మృతుడు పీఆర్ జూనియర్ అసిస్టెంట్
- ధర్మారం వద్ద ఘటన

02

## సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి

- వెంటనే రైతులకు పరిహారం చెల్లించాలి
- మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్
- సిరిసిల్లలో పర్యటన

02

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

# ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ సన్నద్ధం..!

- 6న తుక్కుగూడలో బహిరంగ సభ
- హాజరుకానున్న అగ్రనేతలు ఖర్గే, రాహుల్
- జాతీయ స్థాయి మానిఫెస్టో ప్రకటనకు నిర్ణయం
- సభ నిర్వహణకు తుక్కుగూడ వద్ద ఏర్పాట్లు
- సెంటిమెంటును కొనసాగిస్తున్న హస్తం పార్టీ
- పెండింగ్ స్థానాల్లో గెలుపు గుర్రాల కోసం సర్వే..

**అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి :**

లోక్ సభ ఎన్నికల్లో విజయం కోసం కాంగ్రెస్ ప్రచారానికి సిద్ధమైంది. జాతీయ మ్యానిఫెస్టోను 6న ప్రకటించనున్నారు. తుక్కుగూడలో జరిగే బహిరంగ సభతో ప్రచారానికి శంఖారావం పూరించనున్నారు. ఇప్పటి వరకు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసిన పార్టీ అదిష్టానం ప్రచారంలో దూసుకుపోవడానికి ప్రణాళిక రూపొందించారు. కాంగ్రెస్ ఇచ్చే 5 హామీలను విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. తుక్కుగూడలో 6న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ తాజాగా ప్రకటించింది. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఇచ్చే 5 హామీలను ఆ బహిరంగ సభలో వెల్లడించనున్నారు. శాసన సభ ఎన్నికల సమయంలో తుక్కుగూడ నుంచే ప్రచారం ప్రారంభించి విజయం సాధించిన కాంగ్రెస్ అదే సెంటిమెంట్ ను లోక్ సభ ఎన్నికల్లో కొనసాగిస్తున్నది. సభ నిర్వహణకు పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యారు.

## ఉత్సాహంలో కాంగ్రెస్

ఆసెంబ్లీ ఎన్నికల్లో తుక్కుగూడ నుంచే ప్రచారం ప్రారంభించి విజయం సాధించిన కాంగ్రెస్ ఉత్సాహంతో లోక్ సభ ఎన్నికల్లో కి వెళ్తున్నది. శాసనసభలో విజయం సాధించినట్లే సార్వత్రిక ఎన్నికల్లోనూ గెలుస్తామనే ధీమాతో పార్టీ ఉంది. ఆసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు ప్రకటించిన హస్తం పార్టీ అధికారంలోకి వచ్చాక ఒక్కో హామీ అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నది. ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపు, 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఇప్పటికే అమలయ్యాయి. రూ. 500కే గ్యాస్ అందిస్తున్నారు. స్థలం ఉండి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం కోసం, స్థలం లేని వారికి స్థలం కేటాయింపుకు ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీల అమలు కావడం ప్రజల్లో విశ్వసాన్ని నింపింది. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దేశ ప్రజలకు ఇచ్చే ఐదు హామీలను జాతీయ అగ్రనేతలు రాహుల్ తుక్కుగూడ సభలో ప్రకటించనున్నారు.

## వరంగల్ పై అనిశ్చితి

వరంగల్ స్థానం పై అనిశ్చితి నెలకొంది. పీసీసీ దొమ్మడి సాంబయ్య పేరును ప్రతిపాదించింది. ఇదే స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ దయాకర్ భారాస నుంచి ఇటీవల చేతి పార్టీలోకి మారారు. ఆయన కూడా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. విద్యా సంస్థల అధినేత పరంజ్యోతి, గత ఆసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీను ఎంపీ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఆసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకున్నానని, పార్టీ విధేయుడనని ఆయన అధిష్టానం వద్ద విన్నవించుకున్నారు. రాష్టంలో 17 స్థానాలు ఉండగా 13 మందిని ఇప్పటికే ఖరారు చేశారు. ఇందులో భువనగిరి నుంచి కిరణ్ కుమార్ రెడ్డి, మెదక్ నుంచి నీలం మధు, అదిలాబాద్ స్థానానికి సుగుణ, నిజామాబాద్ నియోజకవర్గం నుంచి జీవన్ రెడ్డి లను బరిలో దింపింది. వీరి పేర్లను బుధవారం రాత్రి ప్రకటించారు. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ స్థానాలు పెండింగ్ లో ఉన్నాయి. బుధవారం పార్టీ సెంట్రల్ ఎన్నికల కమిటీ సమావేశం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో అభ్యర్థుల ఎంపిక ఓ కొలిక్కి రాకపోవడంతో సమావేశం ఈనెల 31కి వాయిదా వేశారు.
ఈ లోగా ఆశావాహుల అభ్యర్థుల పట్ల మరోసారి సర్వే చేసి ఓ నిర్ణయానికి రానున్నారు.

## పెండింగ్ స్థానాల్లో గెలుపు గుర్రాల కోసం సర్వే

నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వీటికి పోటీ తీవ్రంగా ఉండటంతో అదిష్టానం ఓ నిర్ణయానికి రాలేదు. వరంగల్, ఖమ్మం, హైదరాబాద్, కరీంనగర్ స్థానాల్లో టికెట్ ఆశిస్తున్న వారి పట్ల మరోసారి సర్వే చేయనున్నారు. పార్టీ తమ నెట్ వర్క్ ద్వారా ఎవరైతే బాగుంటుంది, గెలుచే అవకాశాలు ఎవరికి ఉన్నాయో తెలుసుకోనున్నారు. ఎవరికి వారు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నా పార్టీ మాత్రం గెలుపు గుర్రాలకు టికెట్ ఇవ్వాలనే దృఢ నిశ్చయంతో ఉంది. ఇందుకోసం పార్టీ అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని మరో సారి సర్వే చేసి ఈనెల 31న జరిగే సీఈసీ సమావేశంలో నాలుగు స్థానాల అభ్యర్థులను ప్రకటించనున్నారు.

# తుక్కుగూడ సభ ద్వారా ఐదు గ్యారెంటీలు

- ప్రకటించనున్న రాహుల్ గాంధీ
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- కొడంగల్ నేతలతో సమావేశం

అక్షర దర్బర్, కొడంగల్ : ఓటు హక్కు చాలా విలువైందని, తనకు ఎన్ని కార్యక్రమాలున్నా ఓటు వేసేందుకు కొండగల్ వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా ఓటు వేసిన అనంతరం ఆయన కొడంగల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 6న తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ సభ ఉంటుందని, ఆ సభలో రాహుల్ గాంధీ 5 గ్యారెంటీలను ప్రకటిస్తారని స్పష్టం చేశారు. ఎన్నికలు వస్తే సెలవులొస్తాయి, తీర్థయాత్రకు వెళ్దాం అనుకుంటారని, అలా కాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఎం రేవంత్ సూచించారు. తన ప్రతీ కష్టంలో కొడంగల్ ప్రజలు అండగా ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ఇంత చేసిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, త్వరలో ఈ ప్రాంతానికి సిమెంటు పరిశ్రమలు రాబోతున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నా, గత పాలకుల నిర్లక్ష్యంతో పరిశ్రమలు రాలేదని, పరిశ్రమల ఏర్పాటైతే భూముల విలువలు పెరుగుతాయన్నారు.

## సహకరించకపోతే నష్టం

ఈ ప్రాంతానికి ఫార్మా కంపెనీలు వస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భూ సేకరణకు సహకరిస్తేనే పరిశ్రమల ఏర్పాటు సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. భూసేకరణలో పట్టా భూములకు, అసైన్డ్ భూములకు ఒకే ధర చెల్లించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సీఎం చెప్పారు. అభివృద్ధికి సహకరించకపోతే ఇక్కడి ప్రాంతం నష్టపోతుందన్నారు. తాను ఎక్కడున్నా ఓ కన్ను కొడంగల్ పై ఉంటుందని, ఇక్కడి వాళ్లను ఎప్పుడూ కాపాడుకుంటానని సీఎం వెల్లడించారు.

## కొడంగల్ కుటుంబ సభ్యుడిని

మీకు మేలు జరగాలని, ఈ ప్రాంతంలో అభివృద్ధి పరుగులు తీయాలన్నదే నా ఆకాంక్ష. నేను ఎంత పెద్ద నాయకుడినైనా కొడంగల్ కుటుంబ సభ్యుడినే. లోక్ సభ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి 50 వేల మెజారిటీ అందించాలి. మండల, బూత్, నియోజకవర్గ స్థాయిలో ఐదుగురు సభ్యుల చొప్పున సమన్వయ కమిటీ నియమించుకోవాలి. మళ్లీ నేను ఏప్రిల్ 8న ఇక్కడకు వస్తా. మండలాల వారీగా సమన్వయ కమిటీలతో సమావేశమవుతా. ఎట్టి పరిస్థితుల్లో మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం. ఈ నెల 6న సాయంత్రం 5 గంటలకు తుక్కుగూడలో జరిగే సభకు నియోజకవర్గం నుంచి భారీగా తరలిరండి అని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు.

# ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

- మృతుడు పీఆర్ జూనియర్ అసిస్టెంట్
- ధర్మారం వద్ద ఘటన

అక్షర దర్బార్, గీసుకొండ : వరంగల్ సమీపంలోని గీసుకొండ మండలం ధర్మారం వద్ద ప్రభుత్వ ఉద్యోగి రావుల రవి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన రవి పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్. జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయన బుధవారం తమ ఇంటి నుంచి బయలుదేరి గురువారం ఉదయం ధర్మారం వద్ద శవమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల రవి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. మృతుడు రవికి భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రవి ఆత్మహత్యపై రైల్వే పోలీసులు విచారణ జరుపుతున్నారు. రవి ఆత్మహత్యతో నల్లబెల్లి మండల కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది.

# నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి..

- వెంటనే రైతులకు పరిహారం చెల్లించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

అక్షర దర్బార్, సిరిసిల్ల : సాగు నీరు లేక ఎండిపోతున్న పంటలను పరిశీలించే తీరిక కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. గత నాలుగు నెలలుగా ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పదేపదే ఢిల్లీకి వెళ్లడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో ఎండిపోయిన పొలాలను కేటీఆర్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పొలాలు ఎందుకు ఎండిపోతున్నాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్టంలో ఇప్పటికే దాదాపు 200 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. రుణమాఫీని అమలు చేసి ఆ రైతుల కుటుంబాల్లో భరోసా కల్పించాలన్నారు. రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటా వరికి రూ.500 బోనస్ ఇస్తామన్న హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని, అవసరమైతే ఎన్నికల కమిషన్‌తో మాట్లాడాలని ముఖ్యమంత్రికి సూచించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినా రైతులు ఎవరూ మనోధైర్యాన్ని కోల్పోవద్దని కోరారు. కాంగ్రెస్ నాయకుల మాటలకు మోసపోయి ఓట్లు వేసినప్పటికీ, మనోధైర్యాన్ని కోల్పోవద్దని, రైతులను పరామర్శించేందుకు కేసీఆర్ త్వరలో వస్తారని కేటీఆర్ రైతులకు ధైర్యం చెప్పారు.



## లైసెన్స్‌డ్ తుపాకులను
# అప్పగించండి

- ఉల్లంఘిస్తే చర్యలే..
- కమిషనరేట్ పరిధిలో 201 లైసెన్స్ వెపన్స్
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వ అనుమతులు ఉన్న తుపాకులను స్థానిక పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు తీసుకునే ముందస్తు చర్యల్లో భాగంగా లైసెన్స్ డ్ తుపాకులను కలిగి వున్న వ్యక్తులు, ప్రైవేట్ సంస్థలు స్థానిక పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని ఆయన పేర్కొన్నారు. ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 201 లైసెన్స్‌డ్ వెపన్స్ ఉన్నాయని, ఇందులో హనుమకొండ జిల్లాలో 131, వరంగల్ జిల్లాలో 52, జనగామ జిల్లాలో 18 తుపాకులు ఉన్నాయని సీపీ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి అందజేస్తామని సీపీ స్పష్టం చేశారు. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి మినహాయింపు ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

# పారదర్శకంగా విధులు నిర్వహించాలి

- అధికారులు, సిబ్బంది సమిష్టిగా పని చేయాలి
- ప్రజల సమస్యలపై వెంటనే స్పందించాలి
- ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి
- లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులతో
- మల్టీ జోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ సమీక్షా సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రజలకు పోలీస్ అధికారులు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని, బాధితులకు న్యాయం జరిగినప్పుడే ప్రజల మన్ననలు పొందుతారని మల్టీ జోన్ -1 ఐజీ ఏవీ రంగనాథ్ అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి పోలీస్ అధికారులతో లోక్ సభ ఎన్నికలతో పాటు, నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే భూపాలపల్లి జిల్లా భౌగోళిక పరిస్థితి, అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గ పరిధి, పోలింగ్ లోకేషన్లు, పోలింగ్ కేంద్రాలు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, జిల్లాలో ఉన్న ఓటర్లు, ఎన్నికల సందర్భంగా సెక్యూరిటీ ప్లాన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐజీకి వివరించారు. అనంతరం ఐజీ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ..లోక్ సభ ఎన్నికల సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వహించాలని అన్నారు. శాంతి భద్రతల విషయంలో నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు దిగితే కఠినంగా వ్యవహరించాలని పోలీసులను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, వర్టికల్ డీఎస్పీ నారాయణ నాయక్, సీఐలు నరేష్ కుమార్, మల్లేష్, రాజేశ్వరావు, నాగార్జున రావు, వసంత్ కుమార్, రామకృష్ణ, రవీందర్, రిజర్వు ఇన్ స్పెక్టర్లు నగేష్, కిరణ్, రత్నం, శ్రీకాంత్, ఎస్సైలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి
# పలువురి చేరికలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే జీఎస్ఆర్

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ , బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడితో పాటు సుమారు 200 మంది నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

## చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్
# పనులను పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : 45 వేల ఎకరాల అదనపు ఆయకట్టు స్థిరీకరణకు చేపట్టిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ముమ్మరం చేయాలని భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి 12 చెరువులకు గోదావరి జలాలను అందించి సాగు నీరు అందించే ప్రక్రియపై రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, మెగా కంపెనీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ కాలువ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. మెగా నిర్మాణ సంస్థ వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గారేపల్లి వద్ద చేపట్టిన విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ పనులను మే నెలాఖరులోగా పూర్తి చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈలు యాదగిరి, తిరుపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్సూర్ నాయక్, ఆర్డీవో మంగిలాల్ పాల్గొన్నారు.

# టికెట్ రాలేదని ఎంపీ ఆత్మహత్య

**- తమిళనాడులో ఘటన**

అక్షర దర్బార్, కొయంబత్తూర్: ఎంపీ టికెట్ రాలేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తమిళనాడులో జరిగింది. డీఎండీకే ఎంపీ గణేశమూర్తి (77) 2019 లోక్సభ ఎన్నికల్లో ఈరోడ్ నుంచి పోటీ చేసి దాదాపు 2లక్షల భారీ మెజారిటీతో గెలుపొందారు. అయితే, ప్రస్తుత ఎన్నికల్లో కూటమి సర్దుబాట్లలో భాగంగా అక్కడి నుంచి దురైవైగోను పార్టీ తమ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో గణేశమూర్తి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలోనే ఆయన ఆదివారం (మార్చి 24) తన నివాసంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు కొయంబత్తూర్లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం హార్ట్ ఎటాక్ తో మరణించారు.

## నూతన వధూవరులను
# ఆశీర్వదించిన ఎమ్మెల్యే దొంతి

అక్షర దర్బార్, దుగ్గొండి : మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన బుస్సారి నిర్మల-తిరుపతి దంపతుల కూతురు సింధుజ-వినయ్ కుమార్ వివాహ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా మహమ్మదాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కామ సోమలక్ష్మి-కేశవకుమార్ కుమార్తె మమతమహి-పవన్ వివాహానికి ఎమ్మెల్యే దొంతి మాధవ్ రెడ్డి హాజరయ్యారు.



వివాహానికి హాజరైన ఎమ్మెల్యే మాధవరెడ్డి

# ఒకటి నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

- జిల్లాలో 146 కొనుగోలు కేంద్రాలు
- రైస్ మిల్లర్లు, లారీ ఓనర్లతో సమావేశంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

అక్షర దర్బార్ మ హనుమకొండ: జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఈ మేరకు ఆమె హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో యాసంగి 2023-24లో ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులు, ధాన్యం కొనుగోళ్లను చేపట్టే మహిళా సమాఖ్య సంఘాల ప్రతినిధులు, లారీ ఓనర్ల సంఘం, రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశాన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఏప్రిల్ 1నుంచి ప్రతి మండలంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై శిక్షణ కార్యక్రమం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సదుపాయం ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 146 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఏ.వెంకట్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మి, డీఆర్డీవో నాగ పద్మజ, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, ఏడీఏ దామోదర్ రెడ్డి, ఏసీపీసో నరసింహారావు, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలువకు పెట్టిన గండిని చూపుతున్న రైతులు

# సరిగాలేని తైబంధు ఖరారు..!

## నీటి చౌర్యంపై పట్టింపేది..?

- పేరుకే తైబంధు ఖరారు
- కాలువల్లో పారుతున్న నీరు
- ఎండుతున్న తైబంధు ఖరారు పొలాలు
- పట్టించుకోని ఐబీ అధికారులు
- చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు

అక్షరదర్బార్, వరంగల్ : 'తలాపున పారుతున్న గోదారి.. మన చేను మన చెలుక ఎడారి' అని గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వినిపించిన పాట ఇది. ఈ పాట ఇప్పుడు ఎందుకు గుర్తు చేసుకోవాల్సిన సందర్భం వచ్చిందంటే నీటి పారుదల శాఖ అధికారులు అనుసరిస్తున్న తీరును చూస్తే గుర్తొస్తున్న దుస్థితి. పంట పొలాలకు నీటిని విడుదల చేసే విధానంలో ఐబీ అధికారులు వ్యవహరించే తీరు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న పరిస్థితి. తాము చేయాల్సిన విధుల్లో సైతం అలసత్వం ప్రదర్శించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### అసలేం జరుగుతుందంటే...

మాధన్నపేట చెరువు కింద ఉన్న పొలాలకు నీటిని విడుదల చేసే క్రమంలో రెండు పంటలకు గాను తైబంధు ఖరారు చేసి కేటాయింపులు జరిపి పంట కాలువల ద్వారా విడుదల చేస్తారు. అయితే తైబంధు ఖరారు విధివిధానాలను పక్కనపెట్టి కొంత మంది కోసమే అధికారులు తైబంధు ఖరారు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈసారి మాధన్నపేట చెరువు కింద ఉన్న 220 ఎకరాలకు, నెక్కొండ రోడ్డు నుండి పుట్టల పంపు వరకు ఉన్న 680 ఎకరాలకు మొత్తంగా 900 ఎకరాలకు తైబంధు ఖరారు చేశారు. ఇలా అక్కడ కొంత, అక్కడ కొంత పంటలకు కేటాయించడం కారణంగా మధ్యలో ఉన్న బడా రైతులు నీటిని తీసుకువెళ్లే కాలువలకు పెద్ద బుంగలు చేసి అనధికార సాగును చేస్తున్నారు. ఇలా చేయడం కారణంగా తైబంధు ఖరారు పంట పొలాల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు.

### ఐబీ అధికారులు స్పందించరు..

ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించే సమావేశాలకు మాత్రమే ఐబీ అధికారులు హాజరవుతారు కానీ పంట పొలాలకు నీటిని అందించే విషయంలో ఏమాత్రం కూడా సహాయం చేయరని రైతులు ఆరోపిస్తున్నారు. నీటి చౌర్యం జరుగుతున్న విషయం, కాలువలకు అనధికార బుంగల విషయం తెలిసినా పట్టించుకోరని రైతులు అంటున్నారు. ఐబీ అధికారులు స్పందించి అనధికార బుంగలను గుర్తించి, వాటిని పూడ్చి తైబంధు ఖరారు పొలాలకు నీటిని అందించాలని వారు కోరుతున్నారు. చెరువులో సరిపడా నీరు లేక పది రోజులకు ఒకసారి నీళ్లు విడుదల చేస్తున్నామని మధ్యలో ఉన్న అధికారుల కారణంగా రైతులు నష్ట పోతున్నారని ఐబీ అధికారి తెలిపారు.

### అండగా ఉంటారా...అడ్డు కట్ట వేస్తారా..

తై బందు ఖరారు చేసినప్పటికీ తైబందులో లేని పొలాలకు నీరు అక్రమంగా వెళ్లడం.. ప్రధాన కాలువకు బుంగలు ఏర్పాటు చేయడం తదితర విషయాలన్నీ ఐబీ అధికారులకు తెలిసే జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఐబీ విభాగంలో పనిచేసే ఓ ఇద్దరు కిందిస్థాయి అధికారులు నీటి చౌర్యం చేసే పలువురు బడా రైతులతో చేతులు కలిపి వారి తాయిలాలకు ఆశపడి తైబందు ఖరారు చేయబడిన పంట పొలాల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి చోరీ చేసే వ్యక్తుల చర్యలకు అడ్డుకట్ట వేసి తైబంధు ఖరారు చేసిన రైతులకు నీటి విడుదల విషయంలో న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంలో నీటి చోరీ చేసే వారికి ఐబీ అధికారులు అండగా ఉంటారో లేక వారి చర్యలకు అడ్డుకట్ట వేస్తారో అనేది తెలియాల్సి ఉంది.

ఓటు వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 99.86 శాతం పోలింగ్

## ఓటు హక్కును వినియోగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

అక్షర దర్బార్, మహబూబ్ నగర్ : మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంత ముగిసింది. గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరిగింది. 99.86శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో 1,439 మంది ఓటర్లు ఉండగా 1,437 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి తన ఓటు హక్కును కొడంగల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వినియోగించుకున్నారు. ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు జరగనుంది. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ తరుపున నవీక్ కుమార్ రెడ్డి, ఇండిపెండెంట్ గా సుదర్శన్ గౌడ్ పోటీలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇద్దరు మినహా అందరు ఓటు వేశారు. కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్, వీడియోగ్రాఫర్ల ద్వారా ఎన్నికల అధికారులు ఓటింగ్ సరళిని పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులను బాలుర జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఎమ్మెల్సీగా ఉన్న నారాయణ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

# ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

## మరో 4 రోజులు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు

అక్షర దర్బార్, ఢిల్లీ : మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు మరో 4రోజులు ఈడీ కస్టడీని పొడిగించింది రౌస్ అవెన్యూ కోర్టు. మరిన్ని రోజులు కస్టడీ విచారణ అవసరమని ఈడీ కోర్టును కోరగా, విచారణ జరిపిన కోర్టు కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలిచ్చింది. గోవాకు చెందిన ఆప్ అభ్యర్థుల వాంగ్మూలం నమోదు చేస్తున్నట్లు చెప్పింది. విచారణలో కేజ్రీవాల్ తమకు సహకరించడం లేదని ఆరోపించింది. కస్టడీ సమయంలో కేజ్రీవాల్ ఎలాంటి పాస్వర్డును వెల్లడించలేదని చెప్పింది. అయితే ముఖ్యమంత్రి కూడా చట్టానికి అతీతులు కాదని ఈడీ పేర్కొంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఈనెల 21న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ను అరెస్టు చేసిన ఈడీ, ఈనెల 28 వరకు కస్టడీలోకి తీసుకుంది. కస్టడీ గడువు ముగియడం వల్ల గురువారం రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చింది. కేజ్రీవాల్ కస్టడీని పొడిగించాలని కోరుతూ పిటిషన్ వేసింది. విచారణ చేపట్టిన కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. విచారణ సందర్భంగా కేజ్రీవాల్ తన తరఫున తానే వాదనలు వినిపించారు.

# కేసీఆర్ ను కలిసిన కేకే

- పార్టీ మారుతానని స్పష్టం..
- మీకేం తక్కువ చేశామన్న కేసీఆర్
- ఈనెల 30న కూతురుతో సహ కాంగ్రెస్‌లోకి..

అక్షర దర్బార్, హైదరాబాద్: బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కే.కేశవరావు(కేకే) గురువారం ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర రావును కలిశారు. కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ దీపా దాస్ మున్షి హైదరాబాదులో కేశవరావును ఆయన కూతురు హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మిని కలిసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన విషయం తెలిసిందే. దీంతో కేకే ఆయన కూతురు విజయలక్ష్మి బీఆర్ఎస్ ను వీడి ఈనెల 30న కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సమాచారం.. ఈ నేపథ్యంలో కేకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను కలిశారు. తను పార్టీ మారుతున్న విషయాన్ని కేకే మాజీ సీఎం కేసీఆర్ వద్ద స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా కేసీఆర్.. బీఆర్ఎస్ పార్టీ మీకు, మీ కుటుంబానికి ఏం తక్కువ చేసిందని అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తను కాంగ్రెస్ పార్టీలో చేరుతానని చెప్పి హైదరాబాద్ చేరుకున్న కేకేను బీఆర్ఎస్ కు చెందిన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితోపాటు గడ్డం అరవింద్ రెడ్డి కలిశారు. ఇటీవల కాలంగా ఇంద్రకరణ్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు తెలిసింది. ఆయన కూడా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

ఆర్థిక సాయం అందజేస్తున్న కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి

# బాధిత కుటుంబాలకు కౌన్సిలర్ ఆర్థిక సాయం

అక్షర దర్బార్ , పరకాల : పరకాల పట్టణంలోని 10వ వార్డు మాదారం కాలనీకి చెందిన సూదమల్ల స్వప్న, 20 వార్డుకు చెందిన బండారు కన్నయ్య ఇటీవల మృతిచెందారు. కాగా, వారి కుటుంబాలకు గురువారం పరకాల పట్టణ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి బియ్యంతో పాటు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. ఆపదలో ఉంటే ఆదుకునే ఆపద్బాంధవుడు పూర్ణచారి అని స్థానిక ప్రజలు అభినందించారు.